క్లుప్తంగా

జాతీయ రహదారిని వీడని చెత్త సమస్య



హుకుంపేట జాతీయ రహదారి పక్కన వేసిన చెత్తకు మంటపెట్టిన దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారి వెంట ఎటువంటి చెత్త వేయరాదని పంచాయతీ అధికారులు, నేషనల్ హైవే అధికారులు మొత్తుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. హుకుంపేట జాతీయ రహదారి పక్కన భవనాలు పడగొట్టిన మెటీరియల్‌తో పాటు చెత్తను తీసుకువచ్చి పోస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆ చెత్తకు మంట పెడుతున్నారు. దీని వలన జాతీయ రహదారిపై వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో పంచాయతీ కార్యదర్శి ఎటువంటి చెత్త వేయరాదని, వేస్తే జరిమానా విధిస్తామని బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు పేర్కొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయ పునః నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాకులోని మర్రిచెట్టు వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం పునఃనిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రూ.లక్ష విరాళం అందించారు. ఆదివారం ఆయన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష నగదును ఎమ్మెల్యే గోరంట్ల అందజేశారు. సత్తెమ్మతల్లి ఆలయం సుందరవనంగా తీర్చిదిద్ది, త్వరితగతిన పూర్తిచేయాలని ఆలయ కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కురుకూరి కిషోర్, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, టి.రాము, చాముండి నాని, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా కూటేశ్వరస్వామి ఆలయ పున ప్రతిష్ఠ

పెదపూడి: గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో స్వామి అమ్మవార్ల కార్యక్రమాలు ఉత్సాహంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో పార్వతీ సమేత కూటేశ్వర స్వామి వారి ఆలయ పునప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా ఆదివారం జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉప సర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠోత్సవం

పెదపూడి: గ్రామంలోని మధ్యవీధిలో పునర్నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు చెరుకూరి రామనాథ కాశ్యశర్మ, కృష్ణశర్మ అధ్వర్యంలో విశేష హోమం, ప్రత్యేక పూజలు చేశారు. సీతారామలక్ష్మణస్వామి సహా హనుమాన్ విగ్రహాలు వేద మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా ప్రతిష్ఠించారు. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు సీతారాముల వారిని దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సినిమాలు



శ్యామల:సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ:రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సూర్యప్యాలెస్:చావా
స్వామి:శబ్దం
శివజ్యోతి:మజాకా
అనుశ్రీ:మజాకా
రాజా:అగత్యా
ఊర్వశి:రామం గార్డ్,రాక్షస
మేనక:తకిట తదిమి తందానా
రంభ:అగత్యా
కుమారి:రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర:తండేల్
అశోక:జాబిలమ్మ నీకు అంత కోపమా
నామవరం:
విఎస్.మహల్:మజాకా
ధవళేశ్వరం:
మురళీకృష్ణ:మజాకా
కడియం:
వెంకటసూర్య:మజాకా

కోటిలింగాల ఘాట్‌లో ఈట్ స్ట్రీట్

త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం



నిర్మాణం పూర్తి చేసుకున్న 10 షాపులు



ఆధునికంగా ఏర్పాటు చేసిన రెండు క్యాప్సుల్స్

రాజమహేంద్రవరం సిటీ: కోటిలింగాల ఘాట్‌లో మరో ఈట్ స్ట్రీట్ ప్రారంభోత్సవానికి సిద్ధం అయ్యింది. నగరపాలక సంస్థ మరో ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. కోటి యాభై లక్షల రూపాయలతో కోటిలింగాల ఘాట్లో నూతన హంగులతో ఈట్ స్ట్రీట్‌ను నగర ప్రజలకు అందించనున్నారు. సాయంత్రం వేళలో గోదావరి ఘాట్‌లో సేద తీరేందుకు వచ్చే పర్యాటకులు, సందర్శకుల కోసం ఈట్ స్ట్రీట్‌ను సిద్ధం చేశారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలో అర్బన్ ఫుడ్ ప్లాజా పేరుతో ఈస్ట్ స్ట్రీట్‌ను నిర్వహిస్తుండగా మరో ఈట్ స్ట్రీట్‌ను కోటిలింగాల ఘాట్లో ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఘాట్‌ను ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టింది. నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయడంతో పాటు నిర్మాణాన్ని చేపట్టింది. ఈట్ స్ట్రీట్‌లో 10 షాపులతో పాటు అల్పాహారాలు ఆరగించేందుకు సిట్టింగ్ సౌకర్యంతో కలిగిన రెండు క్యాప్సుల్స్ ఏర్పాటు చేశారు. ఓపెన్ క్యాటగిరిల్లో రెండు వెండింగ్ జోన్స్ సిద్ధం చేశారు. ఈట్ స్ట్రీట్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. అయితే ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రులు ఎన్నిక సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో వీటిని ఓపెన్ ఆక్షన్ నిర్వహించలేదు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే షాపులను వేలం వేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈట్ స్ట్రీట్‌పై భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లే ఘాట్‌లో మాంసాహార అమ్మకాలను ప్రోత్సహించే విధంగా ఉండటం వలన హిందువుల మనోభావాలు తెబ్బతినే విధంగా ఉందంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లే కోటిలింగాల ఘాట్‌లో కేవలం శాఖాహారమే అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఓపెన్ వెండింగ్ జోన్ ఇలా...

ఓపెన్ వెండింగ్ జోన్‌లో ఆక్షన్ ద్వారా వ్యాపారులకు స్థలాన్ని కేటాయిస్తారు. ఈ స్థలంలో వ్యాపారులు నగర పాలక సంస్థ నిబంధనలకు అనుగుణంగా తమ వ్యాపారాలను ఏర్పాటు చేసుకునే అవకాశం అధికారులు కల్పిస్తారు.

హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉంది



దేశంలోనే అతిపెద్ద ఘాట్‌గా రికార్డు పొందిన కోటిలింగాల ఘాట్‌లో ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాల్సిన పరిస్థితి ఉంది. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా నిర్మాణం జరిగిన ఈట్ స్ట్రీట్‌లో కేవలం శాకాహార పదార్థాలు మాత్రమే అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాలి. ఆధ్యాత్మిక వేత్తల మనోభావాలకు భంగం వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– శేఖర్, రాజమహేంద్రవరం

ఈట్ స్ట్రీట్‌తో ఘాట్ అభివృద్ధి



కోటిలింగాల ఘాట్‌లో నూతనంగా ఈట్ స్ట్రీట్ ఏర్పాటుతో ఘాట్ అభివృద్ధి చెందుతుంది. అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉంది. ప్రజల మనోభీష్టానికి అనుగుణంగా చర్యలు చేపడితే అందరూ ఆనందంగా, ఆహ్లాదంగా గడపడానికి అవకాశం ఏర్పడుతుంది. అభివృద్ధితో పాటు అందరూ ఘాట్‌కు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

–శ్రావణ్, రాజమహేంద్రవరం

నర్సరీ సందర్శన

కడియం: మండలంలోని కడియపులంకలో గల శ్రీ సత్యదేవ నర్సరీని ఆచంట శాసన సభ్యులు పితాని సత్యనారాయణ ఆదివారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత పుల్లా పెద సత్యనారాయణ స్వాగతం పలికి వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మండలంలోని పలు నర్సరీలను ఆదివారం సందర్శించారు. అనంతరం మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి ఇంటికి వెళ్లారు.

స్టాపర్స్ బహూకరణ



ధవళేశ్వరం సీఐ గణేష్ కు స్టాపర్స్ అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ధవళేశ్వరం: ట్రాఫిక్ రెగ్యులేషన్‌లో ఉపయోగించే రెండు స్టాపర్స్‌ను స్థానిక నాయకులు సావాడ శ్రీనివాసరెడ్డి ఆదివారం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు బహూకరించారు. సుమారు రూ.50వేల ఖర్చుతో తయారు చేయించిన ఈ బోర్డులను ఆదివారం ధవళేశ్వరం సీఐ టి.గణేష్ సమక్షంలో పోలీస్‌స్టేషన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై హరిబాబు, హెచ్‌సీ మీసాల శ్రీను పాల్గొన్నారు.

నర్సరీ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పాలకవర్గంతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి దుర్గేష్. చిత్రంలో మంత్రి నాదెండ్ల తదితరులు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఆదివారం స్థానిక జీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేసింది. రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పాలకవర్గం అధ్యక్షుడిగా రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షుడిగా బోడపాటి గోపాలకృష్ణ, జనరల్ సెక్రటరీగా కొండేపూడి నాగు, సెక్రటరీగా తాడాల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా గాజుల రత్తయ్య, ట్రెజరర్‌గా రత్నం మహాలక్ష్మినాయుడు, జాయింట్ సెక్రటరీగా పిల్లా శ్రీనివాస్, కో ఆర్డినేటర్‌గా పాటంశెట్టి శేషుకుమార్, పీఆర్‌వోగా బోడపాటి సత్యనారాయణ, డైరెక్టర్లుగా గాద నాగేశ్వరరావు, అడ్డగర్ల రమేష్, మల్లు శివన్నారాయణ, కో ఆప్షన్ మెంబర్‌గా క్రొవ్విడి వాసులు ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి దుర్గేష్ వీరితో ప్రమాణం చేయించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, నర్సరీ రంగ ప్రముఖులు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహమ్మద్‌ఖాన్‌కు మంచి భవిష్యత్తు ఉంది

- ప్రముఖ నటుడు, గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర
- అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరిలో మాట్లాడుతున్న జిత్‌మోహన్‌మిత్ర, చిత్రంలో మహమ్మద్‌ఖాన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గీత్ సంగీత్ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్‌ఖాన్‌కు గాయకుడిగా మంచి భవిష్యత్తు ఉందని, ప్రతి ఒక్కరు ఆశీర్వదించాలని ప్రముఖ నటుడు, గాయకుడు జిత్‌మోహన్ మిత్ర అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఆనంకళాకేంద్రంలో ఆయన ఆశీస్సులతో ట్రెనింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సౌజన్యంతో విశ్రాంత డీసీపీ, గీత్‌సంగీత్ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్‌ఖాన్ సంగీత విభావరి ఆహుతులను అలరించింది. జిత్ మోహన్‌మిత్ర మాట్లాడుతూ మహమ్మద్‌ఖాన్ తనను కూర్చోపెట్టి తాను, తన కుమార్తె నటించిన సప్తపది చిత్రంలోని బాలు, జానకి పాడిన «గోవులు తెల్లన..పాటపాడడం చాలా ఆనందంగా ఉందన్నారు. ట్రెనింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది చింతపెంట ప్రభాకరరావు మాట్లాడుతూ విశ్రాంత డీసీపీ మహమ్మద్ ఖాన్ ట్రెనింగ్ కళాశాలలో తమతో ఒక ఏడాది చదివినప్పటికీ రాజమండ్రి ప్రజల కోసం సంగీత విభావరి పెట్టడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ ట్రెనింగ్ కళాశాల పూర్వవిద్యార్థి అని జర్మనీ పర్యటన నిమిత్తం సంగీత విభావరికి హాజరు కాలేకపోయారన్నారు. మహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ తాను రాజమండ్రి వాస్తవ్యుడినని, తన సొంత ఊరిలో సంగీత విభావరి నిర్వహించాలన్న అభిలాషతో ఇక్కడ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మహమ్మద్‌ఖాన్‌ను ట్రెనింగ్‌కళాశాల పూర్వ విద్యార్థులు, గాయనీ గాయకులు ఘనంగా సత్కరించారు. విశ్రాంత డీఎస్పీ ఏఆర్ ఖాన్, నూజెళ్ళ శ్రీనివాస్, గాయనీ గాయకులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా పాశాలమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ



పాశాలమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రాజా తదితరులు

సీతానగరం: మండలంలోని కాటవరం గ్రామ దేవత శ్రీ పాశాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణంతో పాటుగా విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఉదయం 11.19 గంటలకు గ్రామస్తులు, దాతల సహకారంతో భక్తుల సమక్షంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న పురాతన ఆలయాల పునః నిర్మాణానికి వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని చర్యలు చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో 117 ఆలయాలు నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో శ్రీవాణి ట్రస్టు ద్వారా ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేయించానన్నారు. శ్రీ పాశాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, అమ్మవారి కృపా కటాక్షాలతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని కోరుకున్నానన్నారు. ఎంపీపీగుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ- 2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మల్లిన చౌదరి పాల్గొన్నారు.

రైతులకు సహాయం అందించాలి

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కాటవరంలో దగ్ధమైన ప్రాంతాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే రాజా

సీతానగరం: మండలంలోని కాటవరంలో జరిగిన అగ్నిప్రమాదంలో టుబాకో బాధిత రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదివారం డిమాండ్ చేశారు. కాటవరంలో నాలుగు బ్యారన్లు, మూడు రెల్లుగడ్డి పాకలు, టుబాకో బేళ్లు శనివారం దగ్ధమయ్యాయి. జక్కంపూడి రాజా సంఘటన ప్రాంతాన్ని పార్టీ నాయకులు, టుబాకో బోర్డు రైతు సంఘం నాయకులు కాట్రగడ్డ సత్యనారాయణతో కలిసి ఆదివారం పరిశీలించారు. రాజా మాట్లాడుతూ 2005 వ సంవత్సరంలో ములకల్లంక రైతులకు సంబంధించి వెదుళ్లపల్లి గ్రామంలో ఉన్న నాటు పొగాకు గొడౌన్‌లో సంభవించిన అగ్ని ప్రమాదం వలన పొగాకు రైతులు నష్టపోయారని అన్నారు. అప్పటి మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పొగాకు రైతులకు నష్టపరిహారం అందించారని గుర్తు చేశారు. కాటవరం పొగాకు బాధిత రైతులకు ప్రస్తుత మార్కెట్లో ఉన్న పొగాకు ధరలను బట్టి కూటమి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, పార్టీ కన్వీనర్ శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, రైతులు పాల్గొన్నారు

కార్మిక వర్గం ఉద్యమించాలి

ప్రకాశం నగర్ : బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమర శంఖం పూరించి ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చందా సత్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ఎం.ఏసుల అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లు గా మార్చి కార్మిక హక్కులను హరిస్తున్నారని విమర్శించారు.

ఏప్రిల్ ఒకటి నుండి లేబర్ కోడ్ లు అమలు చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటిస్తున్నదనీ, నాలుగు లేబర్ కోడ్‌లు అమలు జరిగితే కార్మికులు విష వలయంలో చిక్కుకుంటారని, ఉపాధికి రక్షణ కరవవుతుందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని విమర్శించారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో అక్కడి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆ పోరాటాల స్ఫూర్తితో దేశంలో కార్మిక వర్గం ఉద్యమాలకు. ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. మోహన్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎం.దుర్గాప్రసాద్ ప్రసగించారు.

ఆదిత్యునికి పూజలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆలయంలో వ్రత పూజలు నిర్వహించారు.

మెట్టలో జోరుగా మినుము తీత



రంగంపేటలో మినుము తీతలో మహిళలు

రంగంపేట: మెట్ట ప్రాంత మండలమైన రంగంపేటలో రబీ సీజన్‌లో రైతులు శనగ, మినుము పంటలు సాగు చేశారు. సుమారు 800 ఎకరాల్లో శనగ, 600 ఎకరాల్లో మినుము సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో ఈ పంటలు ఆశాభావంగా ఉన్నాయి. కొద్ది రోజులుగా రైతులు ఈ పంటల తీతను ప్రారంభించారు. కొందరు రైతులు కూలీల సహాయంతో పంట తీతను ప్రారంభించి కుప్పలు వేస్తుండగా, మరి కొంతమంది రైతులు మెషీన్లను ఉపయోగించి పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. ఇప్పటికే మినుము పంట తీత దాదాపు పూర్తవ్వగా, ప్రస్తుతం శనగ తీతలో రైతులు బిజీగా ఉన్నారు. ఈ సీజన్‌లో శనగ, మినుము పంటలు బాగుండటంతో దిగుబడి బాగా రావచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురానికి చెందిన దొడ్డి శివరామకృష్ణ అక్రమంగా మద్యం అమ్ముతుండగా అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. శివరామకృష్ణ వద్ద అక్రమంగా ఇంపీరియల్ బ్లూ, ఆఫీసర్స్ చోయర్స్ బ్లూ, మెక్ డోల్స్ విస్కీ, కింగ్ ఫిషర్ బీర్ స్ట్రాంగ్, ఓల్డ్ అడ్మిరల్, ఆఫీసర్స్ చోయస్ బ్రాండ్లు కలిగిన 16 మద్యం సీసాలు కలిగి అక్రమంగా అమ్మకాలు జరుపుతున్నాడని తెలిపారు. కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని నాగంపల్లి శివారున పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. నాగంపల్లి శివారున పేకాడుతున్న కూనవరానికి చెందిన ముగ్గురు, చీపురుపల్లికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5,250 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఈసీ సేవలు

- ఇక గంటల తరబడి వేచి ఉండనక్కరలేదు
- రిజిస్ట్రేషన్ శాఖ పోర్టల్ ద్వారా సులువుగా పొందవచ్చు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్లరికల్ సెక్షన్

రాజానగరం: భూముల, భవనాలు, స్థలాలపై జరిగే క్రయవిక్రయాల సమయంలోనే కాదు వాటిపై బ్యాంకులలో తీసుకునే రుణాలకు కూడా ఈసీ (రుణభార ధ్రువీకరణ పత్రం - ఎన్‌కంబ్రన్స్ సర్టిఫికెట్) అవసరం ఎంతో ఉంటుంది. ఈసీ ద్వారా వాటిపై ఉన్న లావాదేవీలను తెలుసుకునేందుకు వీలుంటుంది. గతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తేనేగానీ ఈసీ పొందడానికి అవకాశం ఉండేది కాదు. దీనికోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గానీ, మీ–సేవ కేంద్రానికిగానీ వెళ్లవలసి వచ్చేది. వెళ్లిన వెంటనే దొరుకుతుందా అంటే అంత ఈజీ అయ్యేది కాదు ఈసీ పని. దరఖాస్తు చేసి, గంటల తరబడి వేచివుండవలసి వచ్చేది. అయితే ఆ ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ ద్వారా ఈసీని పొందే సదుపాయం అందుబాటులోకి రావడంతో లబ్ధిదారులకు మార్గం సులువైంది. అలాగే దస్తావేజులకు సంబంధించిన నకళ్లను కూడా ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

ఆన్‌లైన్‌లో ఏవిధంగా పొందవచ్చు

రాజమహేంద్రవరం డివిజన్‌లో రాజానగరం, కోరుకొండ, సీతానగరం, పిడింగొయ్యి, కడియం, అనపర్తి, బిక్కవోలులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తున్నాయి.

వీటి నుంచే కాకుండా స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన అధికార పోర్టల్ ద్వారా ఈసీలను పొందవచ్చు. ఇందుకోసం దస్తావేజు నకలుకు రూ.320, 30 సంవత్సరాలలోపు సమాచారంతో ఉన్న ఈసీకి రూ. 300, 30 సంవత్సరాలు పైబడిన సమాచారంతో ఈసీకి రూ.600 ఫీజుగా చెల్లించాలి.

సంతకం లేకుంటే ఫీజు అవసరం లేదు

సంబంధిత అధికారి సంతకాలు లేకుండా ఈసీ తీసుకోవాలనుకుంటే ఏవిధమైన ఫీజు చెల్లించనవసరం లేదు. అధికారి డిజిటల్ సంతకం అవసరమైతే మాత్రం ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవలసిందే. అనంతరమే వారికి ఆన్‌లైన్ ద్వారా అందజేస్తారు. ఇందుకుగాను రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వహిస్తున్న అధికారిక పోర్టల్‌ను ప్రజలు వినియోగించుకోవడం మంచిది.

– వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రాజానగరం

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం బస్‌స్టాండ్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఫిబ్రవరి 26వ తేదీన స్వామివారి కళ్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. స్వామివారి రథోత్సవం బస్‌స్టాండ్, మాదుకొండమ్మ తల్లి, గౌరీదేవి సెంటర్, వందులమ్మ తల్లి ఆలయం మీదుగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొన్నారు. కొబ్బరికాయకొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకుని రాజానగరం నియోజకవర్గంలోని రైతులు, ప్రజలను ఆరోగ్యవంతంగా ఉంచాలని కోరారు. ఆయన మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి భవిష్యత్తును చెప్పిన మహాజ్ఞాని అన్నారు. జరగబోయే విషయాలను ముందే వెల్లడించారన్నారు. ఆయన చెప్పినదంతా ఆచరణలో చూస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట రాజానగరం జెడ్పీటీసీ సభ్యుడు వాశంశెట్టి పెద్దవెంకన్న ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సూరిశెట్టి అప్పల స్వామి, సూరిశెట్టి కుటుంబరావు, దాడి వీరబాబు, తనకాల ప్రసాద్, బుద్దా సన్యాసిరావు, దాడి సత్తిబాబు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజా